క్లుప్తంగా

నారాయణ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్



నారాయణ స్కూల్ ముందు ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరు (టౌన్): భవన నిర్మాణం పూర్తి కాకుండానే తరగతులు నిర్వహిస్తున్న నారాయణ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రశాంతి నగర్‌లోని నారాయణ స్కూల్ ముందు ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారాయణ స్కూల్‌కు అనుమతి లేకున్నా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సెక్రటరీ షారూఖ్, నాయకులు మస్తాన్, నవీన్, హర్ష, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివం, మౌళి పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలందించాలి



రక్తదాన శిబిరాలను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్‌బ్యాంకులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా సేవలందించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న ఏసీఎస్ఆర్ ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు, నారాయణ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు, రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడుతూ ప్రైవేటు బ్లడ్‌బ్యాంకులు తాము సేకరించిన రక్తం యూనిట్లలో నిబంధనల ప్రకారం 30 శాతం ప్రభుత్వ ఆస్పత్రులకు ఇవ్వాలని తెలిపారు. రోగులకు అవసరమయ్యే రక్తాన్ని కొరత లేకుండా అందించేందుకు రక్తదాతలను ప్రోత్సహించాలని కోరారు. రక్తదానం పట్ల అవగాహన కల్పించేందుకు కళాశాలల్లోని యువతను, స్వచ్ఛంద సంస్థలను మరింత వేగంగా మోటివేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మహాసభ



నూతన కమిటీలో ఎన్నికైన అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నెల్లూరు యూనిట్ మహాసభ సమావేశం స్థానిక ఏనుగ సుందరరామిరెడ్డి కల్యాణ మండపంలో శనివారం జరిగింది. తొలుత డీసీసీ బ్యాంకులో పదవీ విరమణ చేసిన పలువురు ఉద్యోగులను సన్మానించారు. అనంతరం అసోసియేషన్ నూతన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీవిద్య, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణయ్య, సుధీర్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వర్దన్‌రాజు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీలుగా సుబ్రహ్మణ్యం, హరిప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంకటరావు, జిల్లా సెక్రటరీగా సుబ్బారెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీగా రోహిత్, ట్రెజరర్‌గా కల్యాణ్ చక్రవర్తితో పాటు ఏడుగురు డైరెక్టర్లు, ఏడుగురు మహిళా సభ్యులను ఎన్నుకున్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్



యోగాసనాలు వేస్తున్న అధికారులు, విద్యార్థులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ, ఎన్‌సీసీ విభాగం సంయుక్తంగా శనివారం ఉదయం నిర్వహించిన సన్నాహక సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఇందులో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు, చిన్నారులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు స్థాయిలో ఏడు వేల ప్రాంతాల్లో 124 మంది మాస్టర్ ట్రైనర్లు, 5000 మందిపైగా సచివాలయ యోగా అభ్యాసకుల చేత యోగా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
ప్రజలందరూ యోగాను దినచర్యగా మార్చుకోవాలనేది కార్యక్రమాల ప్రధాన ఉద్దేశంగా చెప్పారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.హరికృష్ణ, నోడల్ అధికారి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్‌ఈలు వెంకటరమణ, అశోక్‌కుమార్, మెప్మా పీడీ లీలారాణి, యోగా గురువులు స్వప్న, ముత్యాల రవీంద్ర, 24 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



పిచ్చయ్య ఆచారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 47వ డివిజన్ కుక్కలగుంట ప్రాంతంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నేత, కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిచ్చయ్య ఆచారిని పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు.



సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

- **నెల్లూరు సిటీ:** రూరల్ మండలంలోని కొండ్లపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దాలి సుబ్బారెడ్డిని పార్టీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల ఓ ప్రమాదంలో సుబ్బారెడ్డి గాయపడ్డారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై విజయకుమార్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొండ్లపూడి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ నగర అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాసులుయాదవ్ శనివారం రామ్‌జీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ విభాగాల అధ్యక్షులు చీదెళ్ల కిషన్, రావు శ్రీనివాసరావు, లక్ష్మీసునంద, ఆశ్రిత్‌రెడ్డి, 11, 52వ డివిజన్ ఇన్‌చార్జిలు మహేష్ యాదవ్, మహబూబ్ బాషా, పార్టీ నేతలు సింగంశెట్టి అశోక్, పెంచలయ్య, చంద్ర పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న బొబ్బల శ్రీనివాసులుయాదవ్

➡ **నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని ఆ విభాగం జోనల్ అధ్యక్షురాలు, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి శనివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

➡ **నెల్లూరు సిటీ:** జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, పార్టీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిలను వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాసులు యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చింతారెడ్డిపాలెంలోని ఆయన నివాసంలో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కల్యాణిని సత్కరిస్తున్న గౌరి



ఆనం దంపతులతో శ్రీనివాసులుయాదవ్

సెల్‌ఫోన్ల దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఒంటరిగా వెళ్తున్న మహిళను చంపుతామని బెదిరించి సెల్‌ఫోన్లను దోచుకెళ్లిన ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో ఎస్సై అబ్దుల్ రజాక్ శనివారం నిందితుల వివరాలను వెల్లడించారు. ముత్తుకూరు బస్టాండ్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ హాస్టల్ ఇన్‌చార్జిగా రమాదేవి పనిచేస్తున్నారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం ఆమె పెట్రోల్ బంక్ వద్ద నుంచి హాస్టల్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా జ్యూస్‌షాపు వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై ఆమెను అడ్డగించారు. చంపుతామని బెదిరించి ఆమె చేతిలో ఉన్న రెండు సెల్‌ఫోన్లను దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై అబ్దుల్ రజాక్ తన సిబ్బందితో సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన నిందితులు

కాగా ఎస్సై అబ్దుల్ రజాక్ తన సిబ్బందితో ఎస్–2 థియేటర్ రోడ్డులో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. విజయమహల్ గేటు వైపు నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన సంతపేట బుజ్జమ్మరేవుకు చెందిన ఎ.శ్రీకర్, ఎం.సిద్దులు పోలీసులను చూసి తప్పించుకునే క్రమంలో ఎస్సై తన సిబ్బందితో వారిని వెంబడించి పట్టుకున్నారు. ఎందుకు పారిపోతున్నారని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో వారిని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించారు. రమాదేవిని బెదిరించి సెల్‌ఫోన్లను దోచుకెళ్లినట్లు నిందితులు అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, పల్సర్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. శ్రీకర్‌పై సంతపేట పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం, కొట్లాట కేసులు, సిద్దుపై కొట్లాట కేసు ఉందని చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు అభినందించారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై అబ్దుల్ రజాక్

సత్యాలను అన్వేషించాలి

నెల్లూరు(బృందావనం): బైబిల్‌లోని సత్యాలను చారిత్రాత్మక ఆధారాలతో అన్వేషించాలని హైదరాబాద్ కవెనెంట్ స్కూల్ ఆఫ్ క్రిస్టియన్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ పాస్టర్ జోసెఫ్ రవికాంత్ తెలిపారు. వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డానీహాల్లో కన్వీనర్ పి.శామ్యూల్ సుకుమార్ ఆధ్వర్యంలో సమగ్ర బైబిల్ విశ్లేషణ సదస్సును శనివారం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పాస్టర్ జోసెఫ్ రవికాంత్ బైబిల్‌లోని వివిధ అంశాలపై విశ్లేషణాత్మక వివరణ ఇచ్చారు. అనంతరం యువతీ యువకుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా క్వైర్ ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ క్రైస్తవ సంఘాల కాపరులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు సిటీ: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని భర్తపై భార్య రూరల్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. నారాయణరెడ్డిపేటకు చెందిన వనజాక్షి రాజమండ్రికి చెందిన రామకృష్ణతో 2012లో వివాహమైంది. రామకృష్ణ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పూర్తిగా మద్యానికి బానిసైన రామకృష్ణ పనికి కూడా వెళ్లకుండా అదనపు కట్నం తీసుకురావాలని వనజాక్షిని వేధించడం చేశారు. దీంతో ఆమె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలం వివాదంలో తమ్ముడిపై దాడి

నెల్లూరు సిటీ: పొలం వివాదంలో తమ్ముడిపై అన్న దాడికి పాల్పడ్డారు. పోలీసుల వివరాలు మేరకు.. నెల్లూరు రూరల్‌లోని కందమూరుకు చెందిన వెంకటేశ్వర్లు, రవీంద్ర అన్నదమ్ముళ్లు. గత కొంత కాలంగా వారి మధ్య ఓ పొలానికి సంబంధించిన వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో ఇటీవల పొలం సర్వే రిపోర్టు కూడా వచ్చిన క్రమంలో వారి మధ్య గొడవ తీవ్రస్థాయికి వెళ్లింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు తన చేతిలోని వాటర్ బాటిల్‌ను రవీంద్రపై విసిరారు. దీంతో రవీంద్ర కంటికి తగిలి, రక్తం రావడంతో వెంటనే చెన్నైలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత సైనికుల సమావేశం



నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో రిటైర్డ్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ అసోసియేషన్ (పారా మిలిటరీ విశ్రాంత సైనికులు) సమావేశం శనివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నారాయణస్వామి, పుల్లంశెట్టి సురేష్, కార్యదర్శి అంకుపల్లి పాల్, కోశాధికారి పి.స్వామిదాస్ పాల్గొని, మాట్లాడారు. తమకు కార్యాలయ నిర్మాణం కోసం మినీబైపాస్‌రోడ్డులో రెండు సెంట్ల స్థలం మంజూరు చేయాల్సిందిగా రెవెన్యూ విన్నవించామన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుదాం

నెల్లూరు(బారకాసు): నెల్లూరులో వెయ్యి మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా మహిళలు, అధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించి, మాట్లాడారు. నగర పరిధిలోని 160 మంది మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది వేల ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి లేఅవుట్ అప్రూవల్స్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 41 అర్జీలు వచ్చాయని, వాటిలో 14 మందికి సంబంధించిన సమస్యలను పరిష్కరించామన్నారు. నుడాలో మొత్తం 53 లేఅవుట్ల అప్రూవల్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. టిడ్కో ఇళ్లను విజయదశమి నాటికి పూర్తి చేసి పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మెప్మా ఏఎండీ వెంకటేశ్వర్లు, ఎస్ఎంఎం శ్రీనివాసులు, మెప్మా పీడీ లీలారాణి, టిడ్కో ఎండీ సునీల్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ నందన్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

'తన పేరుపై వేరొకరు లోన్ తీసుకున్నారు'

- పోలీసులకు ఫిర్యాదు

నెల్లూరు సిటీ: లోన్ తీసుకుని కట్టడం లేదంటూ ఓ కంపెనీకి చెందిన వారు బెదిరించడంతో ఆరా తీయగా వేరే వ్యక్తి లోన్ తీసుకున్నట్లు తేలడంతో రూరల్ పోలీసులకు బాధితుడు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉప్పుటూరు గ్రామానికి చెందిన రాపూరు హరిబాబు ఓ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ నుంచి ఓ ప్రైవేటు కంపెనీ నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌కు చెందిన లోన్ క్లియర్ చేయలేదని హరిబాబుకు ఫోన్ వచ్చింది. తాను ఎటువంటి లోన్ తీసుకోలేదని చెప్పినా వారు బెదిరించారు. దీంతో లోన్‌కు సంబంధించిన వివరాలు పంపాలని హరిబాబు ఆ ఏజెంట్‌లను కోరారు. వారు పంపగా ఆధార్‌కార్డులో తిరుపతి ప్రాంతం చూపించడం, ఫొటో కూడా వేరే వ్యక్తిది ఉంది. దీంతో నగరంలోని బీవీనగర్‌కు చెందిన ఆ కంపెనీ ఏజెంట్‌లను సంప్రదించగా సమాచారం ఇవ్వకపోవడంతో వెంటనే రూరల్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మతులు చేయించాలి

నెల్లూరు రూరల్: స్థానిక రామలింగాపురం అండర్ బ్రిడ్జి పరిసర రహదారి దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి వెంటనే మరమ్మతులు చేయించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇక్కడి రోడ్డుపై అనేక గుంతలు ఏర్పడాయన్నారు. ప్రస్తుత వర్షాలకు నీరు నిల్వ ఉండడంతో రోడ్డు మరింత జారుడుగా మారిపోయిందన్నారు.

నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

రత్నం విజయదుందుభి



విద్యార్థులను అభినందిస్తున్న రత్నం యాజమాన్యం

నెల్లూరు (టౌన్): నీట్ ఫలితాల్లో డాక్టర్ కిశోర్స్ రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు తెలిపారు. స్థానిక మాగుంట లేఅవుట్‌లోని రత్నం జూనియర్ కళాశాలలో జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సి.జాహ్నవి 588 మార్కులతో 99.88 పర్సంటైల్‌తో జనరల్ కేటగిరీలో 2,505 ర్యాంకు సాధించిందన్నారు. సీహెచ్.లయవర్షిత 99.65 పర్సంటైల్‌తో 7,462వ ర్యాంకు, కె.ప్రజ్ఞశ్రీ 99.61 పర్సంటైల్, డి.సిరి 97.86, సీహెచ్.శేషజానకి శ్రీరామ్ 95.15, ఎన్.తనూజ 94.59, వై.చరణ్‌కుమార్‌రెడ్డి 94.52, కె.సుశ్రిత 94.44, ప్రణీత 93.78, లీలాస్మైలీ 92.21, హర్షనందిని 91.21, దేవపల్లి 86.76 పర్సంటైల్ సాధించారన్నారు. ఈ క్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను రత్నం విద్యాసంస్థల అధినేత డాక్టర్ కృష్ణకిశోర్, వాసంతి కిశోర్‌లు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నీట్ అకాడమి హెడ్ రఘుపతినాయుడు, అకడమిక్ అడ్వైజర్ నరసయ్యనాయుడు, ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

నారాయణ విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ యాజమాన్యం

నెల్లూరు (టౌన్): నీట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో నారాయణ మెడికల్ అకాడమి విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక నారాయణ మెడికల్ అకాడమిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఎస్‌ఈ కవిన్ 161వ ర్యాంకు, పి.శ్రీరామ్ 253, ఎన్.యోగేష్‌కార్తీక్ 323, ఎం.వెంకటశ్రీనివాస్ 515, ఎస్.వైష్ణవ్‌కుమార్ 546, పి.లలిత్‌శ్రీహాస్ 563, ఎం.విశ్వక్ 955, టి.సుభాష్‌శంకర్ 804, పి.కత్రివేల్ 962 ర్యాంకులు సాధించారన్నారు. నారాయణ అకాడమి నుంచి 350 మంది మెడికల్ సీట్లు సాధిస్తారన్నారు. అదే విధంగా 600కు పైగా తొమ్మిది మంది, 550కుపైగా 32 మంది, 500కుపైగా 74 మంది, 450కుపైగా 172 మంది, 400కుపైగా 302 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు.

విశ్వసాయి హవా



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్

నెల్లూరు (టౌన్): నీట్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి హవా ప్రదర్శించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయస్థాయిలో బి.భానుశ్రీ సులోచన 543 మార్కులు, వి.హరిణి 542 మార్కులు, ఎం.చేతన్ 531 మార్కులు సాధించారన్నారు. ఒకే కళాశాల నుంచి 103 మంది విద్యార్థులకు ఎంబీబీఎస్, బీడీఎస్‌లో సీట్లు సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ కృష్ణమోహన్, చైర్‌పర్సన్ రుక్మిణి పాల్గొన్నారు.